## 8న పీపుల్స్‌ప్లాజాలో తలసేమియాపై అవగాహన




హాజరుకానున్న మంత్రి దామోదర రాజనరసింహ

ప్రజాపక్షం / హైదరాబాద్:తలసేమియాపై అవగాహన కార్యక్రమాన్ని ఈ నెల 8న ఉదయం 6 గంటలకు పీపుల్స్ ప్లాజా నెక్లెస్ రోడ్డులో నిర్వహించనున్నట్టు రోటరీ క్లబ్ సైనిక్‌పురి ప్రతినిధులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఇతర ప్రముఖ వైద్యులు హాజరవుతారని పేర్కొన్నారు. హైదరాబాద్ బేగంపేటలోని ఓ హోటల్‌లో తలసేమియాపై అవగాహన, నివారణపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో అరోహి బ్లడ్ సెంటర్ వ్యవస్థాకులు, డాక్టర్ అతిథి,డాక్టర్ రత్న వలి, బ్లడ్ వారియర్స్ గ్రూప్ ఫౌండర్ సందీప్, డాక్టర్ సంతోష్ (నిలోఫర్), డా.తపాడియా, డాక్టర్ అమరేశ్ పాల్గొని, మాట్లాడారు. ప్రతి ఒక్కరికి తలసేమియా పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ తరహాలో తలసేమియా నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలని కోరారు. ఇది అమలైతే 2035 వరకు తలసేమియాను నివారించవచ్చని పేర్కొన్నారు. సదస్సులో రోటరీ క్లబ్ సైనిక్‌పురి డిస్ట్రిక్ గవర్నర్ డా.రాంప్రసాద్, గవర్నర్ ఎలక్ట్ ఉదయ్ కిలాని, పూర్వ గవర్నర్ డా.శరత్ చౌదరి, కెప్టెన్ వేణుగోపాల్, డా.కామేశ్, డా.శ్రీహరి, డా.చేతన్, మూర్తిలతో 150 మంది పాల్గొన్నారు.

## రామచంద్రకు బెస్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్' అవార్డ్...




**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైబిజ్ టివి ఆధ్వర్యంలోజరిగిన 'డిజిటల్ మీడియా అవార్డ్స్ 2026'లో భాగంగా 'బెస్ట్ కమ్యూనికేషన్ స్కిల్స్' రామచంద్రకు లో అవార్డును దక్కింది. ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని రాష్ట్ర మంత్రి మహమ్మద్ అజహరుద్దీన్, మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్ చైర్మన్ ప్రీతి రెడ్డి చేతుల మీదుగా ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా రామచంద్ర మాట్లాడుతూ తనకు దక్కిన గుర్తింపు తనలో మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా మరింత కష్టపడి పనిచేస్తానని ఆయన తెలిపారు.

## బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో ధాన్యం కొనుగోలు చేయలేదు: బీర్ల అయిలయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ పదేళ్ల కాలంలో నెలల పాటు ధాన్యం కొనుగోలు చేయలేదని,కానీ తమ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో 8 వేల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. అధికారం కోల్పోయిన అక్కసుతోనే బిఆర్ఎస్ నాయకులు రైతులను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ రైతులను రెచ్చగొట్టి రాజకీయాలు చేయాలన్నదే హరీష్ రావు ఆలోచన అని, ఆయన దొంగ ధర్నాలను రైతులు నమ్మబోరని చెప్పారు. కెసిఆర్ సుద్దపూస తరహా ఫామ్ హౌస్‌లో కూర్చొని రైతులను రెచ్చగొడుతున్నారని మండిపడ్డారు. ప్రతి గింజను కూడా రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తామని బీర్ల అయిలయ్య తెలిపారు.

## నిరుద్యోగుల పట్ల కపటప్రేమను ప్రదర్శిస్తున్న బిఆర్ఎస్: ఆది శ్రీనివాస్

ప్రజాపక్షం/హైదరాబాద్:బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో గ్రూప్ 1 ఉద్యోగాలను భర్తీ చేయలేదని, కానీ అధికారం కోల్పోయిన తర్వాత నిరుద్యోగుల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని సిఎల్‌పి మీడియా సెంటర్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల ఉద్యోగాలను కల్పించిందని అనేక సార్లు చెప్పిన జీవన్ రెడ్డి, బిఆర్ఎస్‌లో చేరగానే ఆయన అబద్దాలు చెబుతున్నారన్నారు. తెలంగాణ భవన్ అంటేనే అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిందని ఎద్దేవా చేశారు.ఫీజు రీఎంబర్స్‌మెంట్‌ను కళాశాలల ఖాతాల్లోకి కాకుండా , నేరుగా విద్యార్థుల బ్యాంక్ ఖాతాల్లోకి వేయడమే జిఒ 7 ఉద్దేశమని ఆయన వివరించారు. విద్యార్థులు,వారి తల్లి దండ్రులకు భరోసా కల్పించడమే తమ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రేవంత్ రెడ్డి పైన అక్కసుతోనే జీవన్ రెడ్డి మాట్లాడుతున్నారని, కెటిఆర్, హరీశ్ రావు అంటేనే అబద్దాలకు కేరాఫ్ అని అన్నారు. కళ్ల ముందు కనిపిస్తున్న వాస్తవాలను కూడా బిఆర్ఎస్ నాయకులు అంగీకరించడంలేదని,రాజకీయాలు చేస్తున్నారని ఆది శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో త్యాగాలు చేసిన యువతను అవమానపర్చే విధంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడారని, యువత త్యాగాలను ఆ పార్టీ పట్టించుకోలేదని ఆరోపించారు.

## రూ. 7,823 కోట్ల ప్రాజెక్టులను.. ప్రారంభించనున్న ప్రధాని మోదీ

బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణలో ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,823 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారని బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి. సుభాష్ ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లాలో కాకతీయ వారసత్వాన్ని ప్రతిబింబిస్తూ రూ.1,695 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టులను ప్రధాని ప్రారంభిస్తారని, పిఎం మిత్ర కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును జాతికి అంకితం చేస్తారని చెప్పారు. ఇది ఉత్తర తెలంగాణను అంతర్జాతీయ వస్త్ర కేంద్రంగా మారుస్తుందని సుభాష్ అన్నారు. సుమారు రూ.2,000 కోట్ల వ్యయంతో నిర్మించిన బిబినగర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రి సౌకర్యాలను ప్రధాని ప్రారంభిస్తారన్నారు. దీనివల్ల సామాన్యులకు ప్రపంచ స్థాయి వైద్య సేవలు చేరువవుతాయన్నారు. కాజీపేటవిజయవాడ రైల్వే కనెక్టివిటీ, మహబూబ్‌నగర్ జాతీయ రహదారి పనులు, మల్కాపురం పెట్రోలియం టెర్మినల్, సమ్మక్క సారక్క గిరిజన విశ్వవిద్యాలయం వంటి కీలక ప్రాజెక్టుల పురోగతిని ప్రధాని పర్యవేక్షించనున్నారని సుభాష్ చెప్పారు.

## తగ్గిన మావోయిస్టు కార్యకలాపాలు..
# ఎస్ఐబి, గ్రేహౌండ్స్‌కు తగ్గిన పనిభారం

ఇందులోని అధికారులు, సిబ్బందిని ఇతర విభాగాలలో భర్తీ

ప్రజాపక్షం/హైదరాబాద్:ఒకప్పుడు మావోయిస్టుల కార్యకలాపాలను అణచివేయడంలో కీలక పాత్ర పోషించిన ప్రత్యేక విభాగాలు ఇప్పుడు కొత్త దిశలో పయనించబోతున్నాయా అనే చర్చ పోలీసు వర్గాల్లో జోరుగా సాగుతోంది. తెలంగాణలో మావోయిస్టుల ప్రభావం దాదాపు పూర్తిగా తగ్గిపోవడంతో, ఈ ఆపరేషన్ల కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి), గ్రేహౌండ్స్ విభాగాల భవిష్యత్తుపై రాష్ట్ర పోలీసు యంత్రాంగం పునర్ఆలోచన మొదలు పెట్టినట్లు తెలుస్తోంది.

**మావోయిస్టు ముప్పు తగ్గుదల**

గత దశాబ్దంలో తెలంగాణ పోలీసుల కఠిన చర్యలు, ఇంటెలిజెన్స్ ఆధారిత ఆపరేషన్లు, అభివృద్ధి కార్యక్రమాల సమన్వయం వల్ల అడవి ప్రాంతాల్లో మావోయిస్టు కదలికలు గణనీయంగా తగ్గాయి. ముఖ్యంగా భద్రాద్రికొత్తగూడెం, ములుగు వంటి సరిహద్దు జిల్లాల్లో కూడా గతంతో పోలిస్తే కార్యకలాపాలు తగ్గుముఖం పట్టాయి. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కగార్ ఆపరేషన్ మావోయిస్టులకు పెద్ద దెబ్బ కొట్టినట్లయింది.

**ఎస్ఐబి, గ్రేహౌండ్స్ పాత్ర**

మావోయిస్టుల కదలికలను ముందుగానే గుర్తించడం, గూఢచర్య సమాచార సేకరణలో ఎస్ఐబి కీలకంగా పనిచేసింది. మరోవైపు అడవుల్లో గెరిల్లా యుద్ధ శైలిలో దాడులు చేసి మావోయిస్టులను ఎదుర్కొనడంలో గ్రేహౌండ్స్ ప్రత్యేక ఖ్యాతి సంపాదించింది. ఎస్ఐబి విభాగం సుమారు 1,500–2,000 మంది అధికారులు, సిబ్బంది ఉండగా గ్రేహౌండ్స్‌లో సుమారు 1,200–1,500 మంది కమాండోలు ఉన్నారు. మావోయిస్టు కార్యకలాపాలు తగ్గడంతో ఈ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఫీల్డ్ ఆపరేషన్లు తగ్గిన సంగతి వాస్తవమేనని అధికారులు చెబుతున్నారు. అయితే పూర్తిగా పనిలేకుండా ఉన్నారనే వ్యాఖ్యలపై ఉన్నతాధికారులు కొంత మేర స్పష్టత ఇస్తున్నారు. ఇంటెలిజెన్స్ సేకరణ, శిక్షణ, సరిహద్దు రాష్ట్రాల సమన్వయం వంటి పనులు కొనసాగుతున్నాయని పేర్కొంటున్నారు.

**ఇతర విభాగాలలో భర్తీ చేస్తాం: డిజిపి సివి ఆనంద్**





ఎస్ఐబి, గ్రేహౌండ్ విభాగాల్లో ఉన్న అధికారులు సిబ్బందిని పోలీసు శాఖలోని ఇతర విభాగాలలో భర్తీ చేస్తామని డిజిపి వ్యాఖ్యానించారు. అవసరాన్ని బట్టి ఈ విభాగాల్లోని సిబ్బందిని ఇతర విభాగాలకు మళ్లించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు ఆయన సూచించారు. సైబర్ క్రైమ్,శాంతి భద్రతలు,ఇంటెలిజెన్స్ విస్తరణ,డ్రగ్స్ నిరోధక విభాగా వంటి రంగాల్లో అనుభవజ్ఞులైన సిబ్బందిని వినియోగించే అవకాశాలపై దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది.

**భద్రతలో కొత్త సవాళ్లు**

పోలీసు వర్గాల అభిప్రాయం ప్రకారం, మావోయిస్టు ముప్పు తగ్గినా భద్రతా సవాళ్లు పూర్తిగా తొలగిపోలేదు.అంతర్రాష్ట్ర నెట్‌వర్క్‌లు,అండర్ గ్రౌండ్ కేడర్,నగరాల్లో స్లీపర్ సెల్స్ లాంటివి ఇంకా పర్యవేక్షణలో ఉండాల్సిన అంశాలే. ఎస్ఐబి, గ్రేహౌండ్స్ వంటి ప్రత్యేక దళాల నైపుణ్యాన్ని వృథా కాకుండా వినియోగించడమే లక్ష్యంగా ప్రభుత్వం వ్యూహం రచిస్తున్నట్లు సమాచారం. అవసరమైతే ఈ విభాగాలను కొత్త భద్రతా సవాళ్లకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించే అవకాశమూ ఉందని పోలీసు వర్గాలు సూచిస్తున్నాయి. మొత్తంగా, తెలంగాణలో మావోయిస్టు ప్రభావం తగ్గిపోవడం పోలీసు యంత్రాంగానికి ఒక పెద్ద విజయం కాగా, అదే సమయంలో ఈ ప్రత్యేక దళాల భవిష్యత్ వినియోగంపై కొత్త చర్చలకు దారి తీసింది.



## గమ్యం చూపని ఆర్‌టిసి 'గమ్యం యాప్'

బస్సుల రాకపోకలపై స్పష్టత లేక ప్రయాణికుల పడిగాపులు

యాప్‌ను సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి: ప్రయాణికుల డిమాండ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రవేశపెట్టిన గమ్యం మొబైల్ యాప్ పనితీరుపై ప్రయాణికుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ప్రయాణాన్ని సులభతరం చేయాలనే ఉద్దేశంతో తీసుకొచ్చిన ఈ యాప్ ప్రస్తుతం సాంకేతిక సమస్యలతో వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యాప్‌లో ముఖ్యంగా రాత్రి 7 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు 'ఫ్లాగ్ ఏ బస్ ఫీచర్' బస్సుల్లో అందుబాటులో ఉంటుంది. మనకు కావాల్సిన వివరాలు యాప్‌లో నమోదు చేయగానే స్మార్ట్ ఫోన్‌లో స్క్రీన్‌పై ఆటోమేటిక్‌గా గ్రీన్ లైట్ కనిపిస్తుంది. ఆ లైట్‌ను డ్రైవర్ వైపునకు చూపిస్తే సంబంధిత డ్రైవర్ బస్సును ఆపుతారు. ఈ యాప్ ద్వారా మహిళలు సురక్షితంగా, క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, 108కి అనుసంధానమయ్యేలా ఈ యాప్‌ను డిజైన్ చేశారు. అయితే ఈ యాప్ తరచూ హ్యాంగ్ అవడం, క్రాష్ కావడం వల్ల వినియోగదారులు సరైన సమయంలో బస్సుల సమాచారం పొందలేకపోతున్నారు. లైవ్ ట్రాకింగ్ సరిగా పనిచేయకపోవడంతో బస్సుల రాకపోకలపై స్పష్టత లేక ప్రయాణికులు బస్‌స్టాప్‌లలో ఎక్కువ సేపు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక బస్ టైమింగ్స్, రూట్ వివరాలు సరిగా అప్‌డేట్ కాకపోవడం, చూపుతున్న సమాచారం తప్పుగా ఉండడం వల్ల విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంటున్నారు. టికెట్ బుకింగ్ సమయంలో పేమెంట్ ఫెయిల్యూర్ సమస్యలు, ట్రాన్సాక్షన్ పూర్తయ్యాక టికెట్ కన్ఫర్మేషన్ రాకపోవడం వంటి సమస్యలు కూడా తరచూ ఎదురవుతున్నాయని వినియోగదారులు చెబుతున్నారు. యాప్ ఓపెన్ కావడానికి ఎక్కువ సమయం పట్టడం కూడా మరో పెద్ద సమస్యగా మారింది. ప్రతి రోజు లక్షల మంది టిజిఎస్ ఆర్‌టిసి బస్సులను వినియోగిస్తున్న నేపథ్యంలో ఈ యాప్ లోపాలు ప్రజల దైనందిన ప్రయాణాలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయి. గమ్యం యాప్‌పై నమ్మకం తగ్గడంతో కొంతమంది ప్రయాణికులు ఇతర ప్రైవేట్ యాప్‌లను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి సాంకేతిక లోపాలను వెంటనే పరిష్కరించి, యాప్‌ను వినియోగదారులకు సౌకర్యవంతంగా మార్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## వరి కుప్పపైనే గుండెపోటుతో రైతు మృతి

రాయపోల్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విషాదం



**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం:**వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద వరి కుప్పపై రైతు గుండె పోటుతో మృతి చెందిన సంఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది.ఈ సంఘటనకు సంబందించిన వివరాలు కుటుంబ సభ్యులు,గ్రామస్తులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం సమీపంలో రాపోల్ గౌరయ్య(70), ఆయన భార్య వెంకటమ్మ అనే దంపతులు తేమ కోసం గత నాలుగు రోజుల నుండి మండుటెండలో వరి ధాన్యం ఆరా పోసినట్లు తెలిపారు.అయితే ఆదివారం వర్షం వస్తుందనే భయంతో వరి ధాన్యాన్ని ఒక దగ్గరకు కుప్పనూర్చుతున్న సమయంలో గౌరయ్య అనే రైతుకు అకస్మాత్తుగా గుండె పోటు రావటంతో వరి ధాన్యం కోనుగోలు కేంద్రం వద్ద వరి కుప్పపైనే కప్ప కూలి మృతి చెందాడని తెలిపారు.మృతి చెందిన రైతుకు భార్య,ఇద్దరు కోడుకులు ఉన్నట్లు పేర్కోన్నారు.రైతు అకస్మాత్తుగా మృతి చెందటంతో గ్రామంలో విషాధాఛాయలు అలుముకున్నాయి.

**ప్రభుత్వం అసమర్థత వల్లనే రైతు గుండెపోటుతో మృతి: మాజీ ఎమ్మెల్యే**

ప్రభుత్వ అసమర్థత వల్లనే రైతు గుండె పోటుతో మృతి చెందినట్లు బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే మంచి రెడ్డి కిషన్ రెడ్డి విమర్శించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజక వర్గం పలు గ్రామలలో అడావుడితో నామమాత్రంగా వరి ధాన్యం కోనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతుల నుండి ధాన్యం కోనుగోలు చేయక పోవటం,కేంద్రాల వద్ద మౌలిక సౌకర్యాలు కల్పించక పోవటం సిగ్గు చేటన్నారు.కోనుగోలు కేంద్రాల వద్ద రైతులు వరి ధాన్యంతో పడి గాపులు కాస్తుంటే అధికారులు షరత్తుల పేరిట రైతులను తీవ్ర ఇబ్బదులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం కోనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు సక్రమంగా కరువై రైతులు వడ దెబ్బకు,గుండె పోటులతో పిట్టల్లా రైతులు రాలుతున్న ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుందని పేర్కోన్నారు.రాయపోల్ కోనుగోలు కేంద్రం వద్ద గుండె పోటుతో మృతి చెందిన రైతు గౌరయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం మృతి చెందిన రైతుకు సంతాపం తెలిపి కుంటుబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

## తెలంగాణలో ఇవి ఛార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు..
# 7 వరకు దరఖాస్తుల గడువు పొడిగింపు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు తెలంగాణ పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ (టిజిఆర్ఈడిసిఓ), ఎలక్ట్రిక్ వాహన ఛార్జింగ్ స్టేషన్‌ల (ఈవిసిఎస్) ఏర్పాటు కోసం ఆసక్తి వ్యక్తీకరణ (ఈఓఐ) దరఖాస్తుల గడువును ఈనెల 7 వరకు పొడిగించింది. ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ 'పిఎం ఈడ్రైవ్' పథకం కింద అమలవుతోంది. దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని పెంచేందుకు బలమైన ఛార్జింగ్ మౌలిక వసతులను అభివృద్ధి చేయడం ఈ పథకం ప్రధాన లక్ష్యం. ఇందులో భాగంగా 'కేటగిరీసి' కింద ఎంపికైన కేంద్రాలకు అవసరమైన అప్‌స్ట్రీమ్ మౌలిక సదుపాయాలపై 80 శాతం సబ్సిడీ అందించనున్నారు. ఈ పథకం కింద హైదరాబాద్, గ్రేటర్ వరంగల్, పటాన్‌చెరు, సంగారెడ్డి, కరీంనగర్, నల్లగొండ నగరాల్లో ఈవి ఛార్జింగ్ కేంద్రాల ఏర్పాటుకు భూస్వాములు, వాణిజ్య సంస్థలు, ఇతర సంస్థల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**స్థల ఎంపికకు అర్హతలు..**

దరఖాస్తుదారులు కనీసం 200 చదరపు గజాల విస్తీర్ణం గల భూమిని కలిగి ఉండాలి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ప్రధాన నగర మార్గాలు, మార్కెట్ ప్రాంతాలు లేదా షాపింగ్ మాల్స్ సమీపంలోని స్థలాలకు ప్రాధాన్యం ఇస్తారు. స్థలం ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండాలి. అలాగే పార్కింగ్ సదుపాయం, సులభ ప్రవేశంనిష్క్రమణ మార్గాలు, విద్యుత్ కనెక్షన్ సమీపంలో ఉండటం తప్పనిసరి.

**అవసరమైన పత్రాలు**

దరఖాస్తుదారులు భూమి యాజమాన్య ధృవపత్రాలు, గుర్తింపు పత్రాలు, స్థలం ఫోటోలు, లేఅవుట్ వివరాలు, సమ్మతి పత్రం, విద్యుత్ కనెక్షన్ వివరాలను సమర్పించాలి.

**దరఖాస్తు విధానం**

ఆసక్తి గల వారు అధికారిక వెబ్‌సైట్ ద్వారా లేదా ఇమెయిల్ ద్వారా దరఖాస్తులను పంపవచ్చు. దరఖాస్తు చేసినంత మాత్రాన ఛార్జింగ్ స్టేషన్ మంజూరు అవుతుందని హామీ లేదని టిజిఆర్ఈడిఓసి స్పష్టం చేసింది. తుది ఎంపిక పిఎం ఈడ్రైవ్ మార్గదర్శకాల ప్రకారం క్షేత్రస్థాయి పరిశీలన అనంతరం జరుగుతుంది. ఈ కార్యక్రమం ద్వారా స్వచ్ఛమైన శక్తి వినియోగం పెరుగుతూ, రాష్ట్రంలో సుస్థిర నగరాభివృద్ధికి తోడ్పాటు లభిస్తుందని అధికారులు అన్నారు.

## పిఎంజె దోపిడీ - రంగంలోకి హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కరీంనగర్‌లో సంచలనం రేపిన పిఎంజె దోపిడీ కేసు విచారణ వేగవంతమైంది. కేసు తీవ్రత దృష్ట్యా హైదరాబాదు టాస్క్‌ఫోర్స్ బృందం కూడా రంగంలోకి దిగింది. దోపిడీ ఘటన జరిగిన వెంటనే టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక బృందం కరీంనగర్‌కు చేరుకుని స్థానిక పోలీసులతో కలిసి దర్యాప్తును ముమ్మరం చేసింది.దొంగలు అత్యంత ప్రణాళికాబద్ధంగా ఈ దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనాస్థలంలో సిసిటివి దృశ్యాలు, ఫోరెన్సిక్ ఆధారాలను సేకరించి వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నారు. నిందితులు తప్పించుకునే మార్గాలపై ప్రత్యేక దృష్టి పెట్టి చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. నగరంలోని అనుమానాస్పద వ్యక్తులపై నిఘా పెంచడంతో పాటు, గతంలో ఇటువంటి దోపిడీలకు పాల్పడిన నేరస్థుల వివరాలను కూడా పరిశీలిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ రాకతో దర్యాప్తు మరింత వేగం అందుకునే అవకాశం ఉందని, త్వరలోనే నిందితులను పట్టుకునే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. కేసుకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

## కుటుంబాలకు ఆర్థికభారం లేకుండా
# పిల్లల్లో మధుమేహానికి ఉచిత పరీక్షలు,చికిత్స

కేంద్ర మార్గదర్శక పత్రం విడుదల

**న్యూఢిల్లీ:**పిల్లల్లో మధుమేహవ్యాధి లక్షణాలను గుర్తించడం,వారికి ఉచితంగా చికిత్సలు అందించే జాతీయస్థాయి కార్యక్రమానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ ఆదివారం ఒక మార్గదర్శక పత్రాన్ని విడుదల చేసింది. కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ప్రజారోగ్య కేంద్రాల ద్వారా నిరాఘాటంగా పరీక్షలు,చికిత్సల ద్వారా ఈ పథకం కుటుంబాలకు ఉపయోగపడుతుంది. పిల్లల్లో మధుమేహ లక్షణాలు ఉంటే పరీక్షల ద్వారా వాటిని గుర్తించడం, చికిత్స చేయడం, దీర్ఘ కాలిక చికిత్సలు చేయాల్సివస్తే వాటిని కొనసాగించడం వంటి విషయాలకు సంబంధించిన జాతీయ కార్యక్రమానికి మౌలికస్వరూపం ఇచ్చారు. దీనికి సంబంధించిన మార్గదర్శక పత్రాన్ని ఈనెల ఒకటి,రెండు తేదీల్లో న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో విడుదల చేశారు. ప్రజారోగ్య సంరక్షణ సేవలు,కార్యాచరణలో ఉత్తమ విధానాలు అనే అంశంపై జరిగిన సదస్సులో ఈ పత్రాన్ని విడుదల చేసినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా అప్పుడే పుట్టిన పిల్లల దగ్గర నుండి 18 ఏళ్ళ వయసు టీనేజ్ పిల్లల వరకూ ఈ సార్వత్రిక పరీక్షలు చేస్తారు. జీవితకాలం ఇన్సులిన్ థెరపీ చేస్తారు. గ్లూకో మీటర్లు,పరీక్షలు చేయడానికి ఉపయోగించే స్ట్రిప్పులు,రోజువారీ రక్షణ చర్యలు కూడా కొనసాగుతాయి. స్కూళ్ళు, ఇతర సామాజిక విధాన వ్యవస్థల ద్వారా కొనసాగుతాయి. అనుమానించదగిన కేసులను తక్షణం తీసుకుంటారు. వారికి రక్త పరీక్షలు, గ్లూకోజు పరీక్షలు చేస్తారు. జిల్లాస్థాయి ఆరోగ్య కేంద్రాలకు వారిని తరలిస్తారు. పరీక్షల ద్వారా నిర్ధారణ చర్యలు చేపట్టి చికిత్సలు ప్రారంభిస్తారు. ఈ ఉచిత పరీక్షలు,చికిత్సా కార్యక్రమంవల్ల కుటుంబాలపై ఆర్థికభారం పడకుండా ఉంటుంది. తొలి దశలోనే ఈ లక్షణాలను గుర్తించడంవల్ల మేలు కలుగుతుంది. 4–టి విధానం (టోయిలెట్,థస్టీ,టైర్డ్,థిన్నర్) తో చైతన్యం కలిగించడంవల్ల తల్లితండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది. ఈ ప్రక్రియలో టైప్–1 డయాబెటీస్ సంకేతాలు కనిపిస్తే, ఉపాధ్యాయులు,సంరక్షకులు కూడా తల్లిదండ్రులకు సహాయంగా ఉంటారు. డయాబెటిక్ క్లినిక్స్, సంబంధిత వ్యవస్థలు తల్లిదండ్రుల వెంటపడి కొనసాగింపు చర్యలు చేపడతాయి.

## శిక్షణతో మార్గదర్శనం- సేవా బాధ్యతలకు దర్పణంగా ఎక్సైజ్ అకాడమీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:**సేవా భావం, క్రమశిక్షణ, ధైర్యం ఈ మూడు విలువలకు ప్రతీకగా నిలిచే ఎక్సైజ్ శాఖలో కొత్త తరానికి చెందిన అధికారులను తీర్చిదిద్దడంలో ఎక్సైజ్ అకాడమీ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రస్తుత బ్యాచ్‌లో గ్రూప్1 ద్వారా ఎంపికైన అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్లు (ఎఇఎస్), గ్రూప్2 ద్వారా ఎంపికైన సబ్ ఇన్‌స్పెక్టర్లు (ఎస్ఐ) సహా మొత్తం 115 మంది శిక్షణ పొందుతూ కొత్త ఒరవడిని సృష్టిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం ఒక వరంగా భావించే యువతలో పోలీస్, ఎక్సైజ్ వంటి యూనిఫామ్ సేవలపై ప్రత్యేక ఆకర్షణ ఉంటుంది. ఖాకీ వర్ది సేవ, ధైర్యానికి ప్రతీకగా భావించబడుతుండగా, ఈ రంగాల్లో చేరేందుకు కఠినమైన శిక్షణ, శారీరక దృఢత్వం, ఆయుధాలపై పట్టు అవసరం అవుతుంది. ఈ అవసరాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని ఎక్సైజ్ అకాడమీ శిక్షణా విధానాలను రూపుదిద్దుతోంది. ఇప్పటివరకు అకాడమీలో 23 బ్యాచ్‌లకు శిక్షణ ఇవ్వగా, ప్రతి బ్యాచ్‌లో 100 నుంచి 120 మంది వరకు శిక్షణ పొందారు. ప్రస్తుత శిక్షణలో సిద్ధాంతంతో పాటు ప్రాక్టికల్, వ్యాయామం, పరేడ్ అన్‌ఆర్మ్‌వెపన్స్ ట్రైనింగ్ వంటి అంశాలపై సమగ్ర శిక్షణ అందిస్తున్నారు. ఉద్యోగ స్థాయిని బట్టి మూడు నెలల నుంచి



తొమ్మిది నెలల వరకు శిక్షణ వ్యవధి ఉంటుంది.

ఈసారి శిక్షణలో ప్రత్యేకత ఏమిటంటే – గతంలో లేని విధంగా ప్రాక్టికల్ అవగాహనకు ప్రాధాన్యత ఇవ్వడం. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ సి. హరికిరణ్ ఆధ్వర్యంలో కొత్త ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా మహిళా కానిస్టేబుళ్లకు తొలిసారి మద్యం తయారీ సంస్థల పర్యటనలు నిర్వహించి, ఉత్పత్తి విధానాలపై ప్రత్యక్ష అవగాహన కల్పించారు. అలాగే మద్యం డిపోల సందర్శన ద్వారా సరఫరా వ్యవస్థపై అవగాహన పెంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అదేవిధంగా ఆబ్కారీ శాఖలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్లకు కూడా ప్రత్యేక శిక్షణ ఇచ్చి, ప్రతి విభాగంపై పరీక్షలు నిర్వహించి పోస్టింగులు ఇవ్వడం ఈ బ్యాచ్‌కు మరో ప్రత్యేకతగా నిలిచింది. గతంలో అమలులో లేని ఈ విధానాన్ని ప్రవేశపెట్టడం ద్వారా పని నేర్చుకున్న తర్వాతే విధుల్లోకి అనే దృక్పథాన్ని అమలు చేస్తున్నారు.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ కార్యదర్శి రఘునందన్ రావు, కమిషనర్ సి. హరికిరణ్ తదితరులు ప్రారంభించారు. శిక్షణతో పాటు అకాడమీలో సౌకర్యాల మెరుగుదల, అవసరమైన కిట్లు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

శిక్షణలో పాల్గొంటున్న అభ్యర్థులు కూడా ఈ కొత్త విధానాన్ని స్వాగతిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా బలపడేలా శిక్షణ సాగుతోంది. డ్రగ్స్, గంజాయి నియంత్రణలో భాగం కావడం గర్వంగా ఉంది అని ఎఇఎస్ శిక్షణార్థి డాక్టర్ వి.ఎం. నివేదిత తెలిపారు. ప్రజలకు సేవ చేయడానికి ఇది మంచి అవకాశం. శిక్షణలో నేర్చుకునే విషయాలు ఉద్యోగంలో ఎంతో ఉపయోగపడతాయి అని ఎఇఎస్ ట్రైనీ వి. లక్ష్మణ్ ఆనంద్ పేర్కొన్నారు. అలర్ట్‌గా ఉండడం, వివిధ పరిస్థితుల్లో స్పందించడం వంటి అంశాలు నేర్చుకుంటున్నాం అని ట్రైనీ ఎస్సై ఎం. రవళి తెలిపారు. పరేడ్ వెపన్ ట్రైనింగ్ ద్వారా శారీరక దృఢత్వం పెరుగుతోంది. ఈ శిక్షణ మా విధులకు మార్గదర్శకంగా నిలుస్తుంది అని ట్రైనీ ఎస్సై ఎం. వినయ్ కుమార్ అన్నారు.



మొత్తంగా చూస్తే, ఎక్సైజ్ అకాడమీలో జరుగుతున్న ఈ కొత్త తరహా శిక్షణ విధానం భవిష్యత్‌లో సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన అధికారులను తయారు చేయడంలో కీలకంగా నిలుస్తుందని స్పష్టమవుతోంది.

